క్లుప్తంగా

డిగ్రీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు అడ్మిషన్‌లకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. బీఏ హానర్స్(హిస్టరీ) 30, బీకాం హానర్స్(కంప్యూటర్స్ అప్లికేషన్) 2, బీఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్) 22, బీఎస్సీ హానర్స్ (బాటనీ) 19 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 9441964145, 9000280032 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన శ్రీఅంకాళమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ అమ్మవారి ఆలయాల్లో దసరా నవరాత్రి వేడుకలను విజయవంతం చేద్దామని పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఏడుగంగమ్మల ఆలయం, ముత్యాలమ్మ ఆలయం, బంగారమ్మ ఆలయాలను పరిశీలించారు, క్యూలు, ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఓ వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. బీఆర్‌సీఎఫ్ ఎస్ఐ రవి, కానిస్టేబుల్ నరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు నారాయణవనంకు చెందిన ప్రభాకర్‌రావు(50)గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణ

ఏర్పేడు: విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య తెలిపారు. శనివారం మండలంలోని వ్యాస్ నగర్, కోబాక రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెల ఎత్తు పెంచారు. అనంతరం సిబ్బందికి స్పాట్ ఎర్త్ రాడ్లను పంపిణీ చేశారు. టాన్స్‌ఫార్మర్‌ల వద్ద స్పాట్ రాడ్‌ల ఏర్పాటుతో ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు.

మహాశివరాత్రిని తలపించిన భక్తుల రద్దీ

- రాహుకేతు పూజలకు పోటెత్తిన భక్తులు
- రికార్డు స్థాయిలో 5,627 పూజలు
- 30 వేల మందికి పైగా దర్శనానికి రాక



చీకట్లోనే రాహుకేతు పూజలు



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం మహాలయా అమావాస్య సందర్భంగా భక్తజనసంద్రమైంది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. రాహుకేతు పూజలు రికార్డు స్థాయిలో 5,627 జరిగాయి. సుమారు 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరారు. ఎటు చూసినా మహాశివరాత్రిని తలపించే విధంగా భక్తుల సందడి కనిపించింది. కాగా పట్టణ వ్యాప్తంగా ఉదయం 9 నుంచి 2గంటల వరకు విద్యుత్ కోత విధించారు. ఈ నేపథ్యంలో ఆలయంలో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, పాలకమండలి విఫలమైంది. ఒక జనరేటర్ శుక్రవారం రాత్రి మరమ్మతులకు గురైంది. విద్యుత్ సరఫరా అంతరాయంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంట అనంతరం సరఫరాను పునరుద్ధరించారు. ఈ విషయమై దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులను వివరణ కోరగా విద్యుత్ అంతరాయం ఏర్పడిన మాట వాస్తవమేనని, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి పునరుద్ధరించినట్లు తెలిపారు. అలాగే రాత్రి ఆలయంలో అమావాస్య ఉత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు.



శనివారం రాత్రి స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

ప్రజలకు సేవకుడిని.. అందుబాటులోనే ఉంటా..



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పటికీ సేవకుడినేనని, నిత్యం వారికి అందుబాటులో ఉంటున్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. భాగంగా శనివారం సాయంత్రం రేణిగుంట పట్టణంలోని రాజమాత కల్యాణ మండపం, పాత చెక్‌పోస్ట్, సీబీఐడీ కాలనీ, బాలాజీనగర్, ఆర్‌ఈ క్వార్టర్స్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రతి ఇంటా సాదరంగా ఆహ్వానించి జగనన్న పాలనలో పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కాల్వలు, సీసీ రోడ్లు నిర్మించాలని కొందరు కోరారు. బాలాజీనగర్‌లో కనకదుర్గ అనే మహిళ చాలా కష్టంగా ఉందని ఎమ్మెల్యేకు చెప్పగా, వెంటనే రూ. 5 వేలు సాయమందించారు. సెయింట్ లూథరన్ చర్చి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటా నవరత్నాలు పథకాల కింద సగటున రూ.5లక్షలు నుంచి రూ.7లక్షల వరకు నేరుగా ప్రజలకు అందిందని అక్క,చెల్లెమ్మలు సంతోషాన్ని పంచుకోవడం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత 30 ఏళ్ల పాలనలో ప్రజలు సమస్యలు చెప్పుకోవాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఉండేదని అన్నారు. అప్పటి పాలకులు ఎన్నికల్లో గెలవగానే హైదరాబాద్‌కు వెళ్లి వ్యాపారాలను చూసుకునే వారని గుర్తు చేశారు. తొలిసారిగా తాను శ్రీకాళహస్తిలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి సిబ్బందిని పెట్టడమే కాకుండా తాను, తన కుమార్తె పవిత్రారెడ్డి అందుబాటులో ఉంటూ, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, మండల నాయకుడు జువ్వల దయాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ గంగారి రమేష్, నాయకులు జువ్వల ధనంజయరెడ్డి, సుందరమూర్తి, జాన్‌బాబు, మన్యం శ్రీనివాసులురెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి, యోగేశ్వరరెడ్డి, గిరిరెడ్డి, మరియమ్మ, కృష్ణమూర్తి, పద్మావతి, రఫీవుల్లా, వార్డు సభ్యుడు ఇన్పనాథన్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అమావాస్య పూజలు



ప్రత్యేకాలంకరణలో శ్రీసొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో శనివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అవధూత శ్రీసొరకాయల స్వామి ఆలయంలో ఉదయం మూలవరులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధభరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్న ప్రసాదాలను వితరణ చేశారు. అలాగే వీరరాఘవస్వామి, కైలాసనాథకోన లోని శివశక్తి, శాంతి ఆశ్రమాల్లో అమావాస్య పూజలను నిర్వహించారు. అన్నదానం చేశారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ



ముస్తాబైన అవనాక్షమ్మ ఆలయం

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీఅనుబంధ ప్రముఖ శ్రీఅవనాక్షమ్మ ఆలయంలో శరననవరాత్రి ఉత్సవాలకు శనివారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్‌సెల్వం ఈసందర్భంగా మాట్లాడుతూ పేర్కొన్నారు. రోజూ అమ్మవారికి ఉదయం అభిషేకాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అభిషేక సేవలో భక్తులు రూ.30 చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా పెరటాశి పూజలు



వరదయ్యపాళెం: కల్యాణోత్సవం



నాగలాపురం: ఊంజల్ సేవలో అమ్మవారు



బీఎన్‌కండ్రిగ : పూజల్లో పాల్గొన్న భక్తులు



ఏర్పేడు : విశేషాలంకరణలో స్వామివారు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీవేదవల్లి సమేత శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో తమిళ పెరటాశి నాలుగో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచి నిత్యపూజ కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి,అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. రోజూ ఒక అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. .

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి, బుచ్చినాయుడుకండ్రిగ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పెరటాశి నాలుగో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో ఉత్సవమూర్తులను ట్రాక్టరులో కొలువుదీర్చి గ్రామాల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి భజన కార్యక్రమం జరిగింది. పండరి భజన ఆకట్టుకొంది.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి 4వ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ రకాల అభిషేకాల అనంతరం విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వైభవోపేతం.. శ్రీనివాస కల్యాణం

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాశి మాసం 4వ శనివారం పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఎంపీపీ పద్మప్రియ దామోదర్‌రెడ్డి దంపతులు సారె అందజేశారు. ధర్మకర్త వేలా సుందరం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వేద పండితులు మధుసూదనశర్మ, మోహనాచార్యులు, నిరంజనాచార్యులు ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ కనులపండుగగా కల్యాణం జరిగింది. అనంతరం గ్రామోత్సవం వేడుకగా జరిగింది. గోవింద నామస్మరణలు మిన్నంటాయి.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ప్రార్థనలో మత పెద్దలు, ముస్లింలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధి తిరుపతి–శ్రీకాళహస్తి జాతీయ రహదారి పక్కన ఉన్న సయ్యద్ అరిఫుల్లా సాహెబ్ దర్గా వద్ద శనివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. మహ్మద్ ప్రవక్త జన్మదిన నెల చివరి రోజును పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. మత పెద్ద మీర్జా సాహెబ్ ప్రవక్త జీవితం, మానవాళికి అందించిన సమాజ ధర్మం తదితరాలను వివరించారు. దర్గా వద్ద మతపెద్దలు, ముస్లింలు ప్రార్థనలు చేశారు. అన్నదానం జరిగింది. మత పెద్దలు జుబైర్ హయత్ క్వాద్రి, జాకీర్ హుస్సేన్, అవేజ్, అబుల్ ఫైజ్, షేక్ బాబు పాల్గొన్నారు.